# ఎన్నిక

హైద్రాబాద్‌నుంచి టెలిగ్రాం వొచ్చింది. ప్రస్నూటనీ ఆదివారం యేర్పాటయింది గనక వెంటనే బైలుదేరి రమ్మని. తప్పిందిగాదు. శనివారం రాత్రి బస్సులో కూచుని అమ్మిరెడ్డి గురించి ఆలోచించేను!

కథలూ, నవలలూ రాసుకునే రోజుల్లో ప్రజల్నుంచి నాకింత "గమనింపు" రాలేదనే చెప్పాలి. ఏ శుభముహూర్తాన ఈ నాటకాలు ప్రారంభించేనోగానీ, ప్రారంభించిన కొన్ని మాసాల్లోనే ప్రతి వూరా నా నాటకాలు ప్రదర్శింపబడి మన్నన లందుకున్నాయి!

ఆర్నెల్ల క్రితం 'బ్రతకనేర్చిన మనిషి' రాసేను. అమ్మిరెడ్డి ఆ నాటకంలో ముఖ్యమైన పాత్ర. అమ్మిరెడ్డి వయస్సు రమారమి పద్దెళ్ళకి మించరాదు. నాటకం మధ్యలో అమ్మిరెడ్డి తండ్రి చనిపోయాడు. బ్రతికున్న రోజుల్లో చాలా విలాసంగా గడిచిన మనిషి అమ్మిరెడ్డి తండ్రి. అప్పులు చేసు

డంలో సిద్ధహస్తుడు. దానివల్ల అతను పోయిన పిదప, మిగిలిన కొంపకాస్తా అప్పులవాళ్ళ పరమవుతుంది. అమ్మిరెడ్డి వీధిలో నించోని గుండెలవిసేలా యేడుస్తాడు. ఇక్కడ అమ్మిరెడ్డి నటన పరాకాష్టనందుకుంటేనేగాని నాటకం రాణించదు. గనక అమ్మిరెడ్డి పాత్రకి తగిన కుర్రాడు చాకులాటి వాడై వుండాలి. వయసు చిన్నదైనా నటన విషయంలో తగిన జాగ్రత్త తీసుకోవలసి వుంటుంది.

'బ్రతకనేర్చిన మనిషి' మొట్టమొదటి మూడు ప్రదర్శనలూ నేను చూడడం జరిగింది. అయితే నేనూహించి రాసిన అమ్మిరెడ్డిని ఆ ప్రదర్శనల్లో చూడలేకపోయేను.

ఈ మధ్య నాకా పాత్రపైన "భయం" కూడా వేస్తోంది. ఆలోచన లేకుండా అలాంటి పాత్రల్ని నాటకంలో రాసేయడం నాకు సులభమేమోగానీ ప్రదర్శకులకు మాత్రం తలకు మించిన పని! అందుకే అమ్మిరెడ్డిమీద నమ్మకంపోయి, భయం వేస్తోంది!

ఈ నాటకం తీసుకున్న హైద్రాబాద్ ప్రదర్శకులు స్థానికంగా మంచి పేరున్న నటులని విన్నాను. వాళ్ళ అమ్మిరెడ్డిని చూడాలని యెప్పట్నుంచో అనుకుంటున్నాను. ఎందుచేతనోగాని వాళ్ళ అమ్మిరెడ్డి నాకు అన్యాయం చేయడని పిస్తోంది? కేవలం ఈ కారణం వల్లనే వాళ్ళ స్క్రూటినీ చూచేందుకు – ముఖ్యంగా ఈ కొత్త అమ్మిరెడ్డిని పరీక్షించేందుకు ఆయత్త పడ్డాను.

8)

హైదరాబాద్‌లో బస్సు దిగుతూనే వాళ్ళందరూ నాకు స్వాగతం పలికేరు. వాళ్ళు తెచ్చిన టాక్సీలో కూచుంటూ వాళ్ళ ఆర్గనైజర్ని అడిగేను అమ్మిరెడ్డిని చూపించమని. అతను సిగరెట్టు ముట్టిస్తూ అన్నాడు. "ఇంకా రాలేదు. స్ప్రూటినీ వేళకొస్తాడు. మెరికలాంటి కుర్రాడు లెండి!"

ఆ సాయింత్రం నాలుగున్నర క్కాబోలు రవీంద్రభారతిలో స్ప్రూటినీ యేర్పాటు చేసేరు. మూడు గంటలనుంచే నటులు రంగులు వేసుకోడం ప్రారంభించేరు. అప్పటికొచ్చి గూడా అమ్మిరెడ్డి రాలేదని విన్నాను. మనసు కొంచెం బాధ పడ్డది.

నన్నంటిపెట్టుకు తిరుగుతూన్న స్ప్రూటినీ అధికారి నా మనసు గమనించక,

"అదేం అలా ఉన్నారు? యూ ఆర్ నాట్ ఫీలింగ్ వెల్ ఐ సీ!" అని తెలుగులో పరామర్శించి యింగ్లీషులో హెచ్చరించేడు. నవ్వేసి వూరుకున్నానేగాని నా కోరిక అతనికి చెప్పలేదు. నాలుగ్గంటల క్కాబోలు అమ్మిరెడ్డి పాత్రధారి వొచ్చేడని యెవరో కుర్రాడు చెప్పేడు. వెంటనే గ్రీన్ రూం లోకి వెళ్ళిపోదామనుకున్నాను. కానీ అధికారి ఉపన్యాసానికి మధ్యలో అవాంతరం కలిగించడం శ్రోతగా నా ధర్మం కాదని తప్పనిసరిగా ఆ ఆడిటోరియంలో బల్లిలా కూర్చుండవలసిన అవసరం యేర్పడింది. అధికారి సంభాషణ ముగింపుకి రాక మునుపే ఓ లావుపాటి వ్యక్తివొచ్చి నా పక్కన కూచుంటూ

నన్ను పలకరించేడు. నే నతనివేపు చూచిన మరుక్షణమే అతన్ని ఖరీదైన మనిషిగా గుర్తించేను. ఆయన తనని తను పరిచయం చేసుకున్నాడు. చిట్టిబాబు తండ్రిట.

ఇక్కడ ఈ నాటకంలో అమ్మిరెడ్డి వేషం వేస్తోన్న కుర్రాడిపేరు చిట్టిబాబు.

సరిగ్గా నాలుగున్నరకే తెరతొలిగింది. నాటకం మొదలు పెట్టేరు. మొదటి రంగం పూర్తవుతుందనగా ఓ తడవ పరిశీలనాధికారివేపు చూసేను. అతను గోడమీద బొమ్మలవేపూ, అప్పుడప్పుడు తన చేతి గడియారం వేపూ, చూస్తూన్నాడు. నాటకంపట్ల అతని నిర్లక్ష్యానికి చాలా నొచ్చుకున్నాను.

పెళ్ళిచూపులకీ, ఈ స్క్రూటినీలకూ చాలా దగ్గరసంబంధం వున్నదని నాటకాలు రాయడం మొదలు పెట్టిన తొలి రోజుల్లోనే పూర్తిగా తెలిసొచ్చింది. వొచ్చిన వరుడి మీద కన్నెపిల్ల పెళ్ళి ఆధారపడినట్లే. ఇక్కడ ఈ పరిశీలనాధికారి నిర్ణయంమీద నాటక సమాజంవారి కొన్ని నెలల వ్యయప్రయాసలు ఆధారపడి వుంటాయి. ఆడపిల్లల తల్లిదండ్రుల ఆరాటం ముందు సమాజం నిర్వాహకుల గుండెదడ ఏమాత్రం తీసిపోదని చెప్తాను.

మొదటిసీను పరిశీలనాధికారి అంతగా ఆ కట్టుకోలేకపోయినా, రెండో సీనులో అతను బాగా కదిలిపోయినట్టు గమనించేను. దానికి సాక్ష్యం ఆ సీను పూర్తయింతర్వాత అతని కనుకొలకుల్లో నీళ్ళు చెక్కు చెదరకుండా వుండటమే!

ఇక నా విషయం వేరే చెప్పనవసరం లేదు. ఆ సమాజం నిర్వాహకుడు చెప్పినట్టు చిట్టిబాబు "మెరిక" లాటి కుర్రాడు. అతను అమ్మిరెడ్డి పాత్రని మనోహరంగా పోషించేడు. ఇక్కడ, ఈ నగరంలో – నేనూహించి రాసిన అమ్మిరెడ్డిని ఖచ్చితంగా చూడగలిగేను. ఆ సీను పూర్తవుతుందనగా అమ్మిరెడ్డికి రాసిన నాలుగు మాటలూ చిట్టిబాబు చాలా బాగా అనగలిగాడు. ఓ దివ్యానుభూతిని పొందినట్లయింది నాకు.

"అయ్యా! సార్! దేవుడితోపాటు వీరంతా కూడా నా కన్యాయం చేసేస్తున్నారు! నేనిప్పుడు తండ్రిలేని వెధవని, కుర్ర కుంకని. నామీద జాలి చూపించండి సార్! నన్నోదార్చండి!"

నా పక్కనే కూచున్న చిట్టిబాబు తండ్రి కళ్లొత్తుకోవడం స్పష్టంగా చూడగలిగేను!

— తిరిగి మా వూరొచ్చిన నెలరోజులక్కాబోలు స్క్రూటినీలో 'బ్రతకనేర్చిన మనిషి' ఎన్నికైన శుభవార్త తెలిసింది. ఆ నాటకం ఎన్నికవడానికి ముఖ్యమైన కారణం అమ్మిరెడ్డి పాత్రనీ నాకు తెలుసు.

మా వూర్లో నా స్నేహితుల్తో నేనక్కడ చూచిన అమ్మిరెడ్డిగురించి ఘనంగా చెప్పేను. చిట్టిబాబు ఉజ్జ్వలమైన భవిష్యత్తుకి వారసుడవుతాడనీ జోస్యం చెప్పేను, ఇది విని చాలామంది నవ్వేసి వూరుకున్నారు. అది గమనించి ఈ ప్రచారాన్ని మరి తగ్గించక తప్పలేదు.

ఆఫీసుపని ఒత్తిడిలో తల నిండుగా మునిగిపోయిన నాకు "బ్రతకనేర్చినమనిషి" ప్రదర్శన తేదీ వారంరోజులు ముందుగానే తెలిసింది. భాగ్యనగరంలో ఆ రవీంద్ర భారతి లోనే రసజ్ఞులముందు ప్రత్యేకాహ్వానితులైన సినీనటులు, దర్శకుల సమక్షంలో యేర్పాటుచేసిన పోటీల్లో నాకు నచ్చిన అమ్మిరెడ్డి పరిచయం కాబోతున్నాడని వినగానే నా ఉత్సా హం పరవళ్ళు తొక్కింది, ఆ పోటీల్లో తుది ప్రదర్శన "బ్రతక నేర్చిన మనిషి" అదే రోజు బహుమతి ప్రదానోత్సవం గూడాను.

కానీ, నా అఫీసుపని నా ఉత్సాహాన్ని మరుక్షణంలో చంపింది. అయినా ఆవేళకి తప్పనిసరిగా వెళ్ళి అమ్మిరెడ్డిని అభినందించాలనే తపన రోజురోజుకి ఎక్కువవుతూవొచ్చింది. ఆరోజులు పగటి కలల్లోనే గడిపేను. వదోరోజు - సరిగ్గా నా నాటకం ప్రదర్శన రోజుకి భగవదనుగ్రహంవల్ల ఎలాగైతేనేం శెలవు సంపాదించ గలిగేను. ఆఫీసునుంచే బస్టాండుకి వెళ్ళేను.

బస్సు హైద్రాబాద్ చేరేవేళకి చాలా వేళయింది. టాక్సీ ఎక్కి రవీంద్ర భారతి దగ్గిర దిగేను. నేను ఆడిటోరి యంలో అడుగుపెడుతూన్న వేళకి రెండోసీను జరుగుతోంది. పోటీల్లో ఈ రోజు చివరిది గనక చాలా ముఖ్యమైన రోజు. ప్రేక్షకులు కిటకిట లాడిపోతున్నారు.

గుండె చేతుల్లో పెట్టుకుని గోడనానుకుని ప్రదర్శన చూస్తున్నాను. మంచి రక్తిగా నడుస్తోంది రంగం. అమ్మిరెడ్డి పట్ల ప్రేక్షకుల సానుభూతిని ప్రత్యక్షంగా విన్నాను. ఆ సీను

పూర్తవుతూండగా ఆడిటోరియంలో ఎవరో రసజ్ఞుడు "లవ్లీ" అని అరిచేడు. ఆ కేక వెంబడి గబగబా చప్పట్లు వినిపించేయి. ఆనందాశ్రవుల విలువెంతో అప్పుడు నాకు తెలిసొచ్చింది.

బహుమతి ప్రదానోత్సవం జరుగుతూన్నప్పుడు మరింత నిటారుగా నించున్నాను. ఆ ఏడాది ఉత్తమ నటుడుగా నా అమ్మిరెడ్డి పాత్రధారి చిట్టిబాబే ఎన్నికయ్యాడు. ప్రేక్షకుల హర్షామోదంతో ఉక్కిరి బిక్కిరి రయ్యేను. ఉత్తమ ప్రదర్శన బహుమతీ నా నాటకానికే లభించింది!

ఎగిరి గంతు వేయాలనిపించింది. గబగబా గ్రీన్ రూము వేపు నడిచేను. ముఖ్యంగా చిట్టిబాబుని అభినందిచాలని. కాని – అక్కడ చేరిన మనుష్యుల్ని చూడగానే, వాళ్ళక్కాస్త దూరంగా ఆగిపోయేను. ప్రఖ్యాత సినీ దర్శకులొకరు చిట్టిబాబుతో యేమి టేమిటో మాటాడుతున్నారు. వాళ్ళిద్దరి చుట్టూ తతిమ్మా నటులందరూ గుమిగూడేరు! వాళ్ళలో ఒక్కరూ నన్ను గమనించే స్థితిలో లేరు. వాళ్ళఉత్సాహానికీ, చిట్టిబాబు అదృష్టానికీ, నేను ముచ్చటపడిన మాట వాస్తవం!

నా భుజంమీద ఎవరిదో చేయి పడ్డది. ఉలిక్కిపడి ఆవేపు చూసేను. అతను సుదర్శనరావు! నా మిత్రుడు. అతనన్నాడు —

"హొచ్చేయ్? ఇప్పుడు మీ వాళ్ళకి నీతో అవసరమేమీ లేదు! గనక వాళ్ళ నిబ్బంది పెట్టకు! నీ మర్యాదా కాపాడుకో: హొచ్చేయ్"

నిజంగూడా అదేను. సుదర్శనంతో పాటు అత నింటికి వెళ్ళిపోయేను. ఆ రాత్రి నిద్రస్సలు పట్టనే లేదు.

ఉదయం పదిగంటలకాని స్నానం గట్రా ముగించ లేదు. సుదర్శనం కాఫీ తాగి వాళ్ళాఫీసుకి వెళ్ళిపోయేడు. నేను చిక్కడపల్లి వేపు నడిచేను.

మునుపు స్ట్రాటిసీ జరిగినప్పుడు చిట్టిబాబు వాళ్ళిం టికి వెళ్ళేను. ఇప్పుడు వాళ్ళ యిల్లు పోల్చుకోడం కష్టమనిపిం చినా చివరికి వాళ్ళింటి ముందు నించో గలిగేరు. అయితే ఇప్పుడా ఇంటికి తాళం వేసి వుంది.

రాత్రికి రాత్రి ఆ తండ్రీ కొడుకు లిద్దరూ మదరాసు బండెక్కి పోయారేమోనని ఆతాళం చూడగానేఅనిపించింది. కానీ, అక్కడికి దాపులోవున్న కుళాయి దగ్గిర నీళ్ళు పట్టుకుం టూన్న చిట్టిబాబుని చూడగనే నా అనుమానం పటాపంచ లయ్యింది. గబగబా అతని వేపు నడిచేను.

నన్నతను చూచిన క్షణంలో అతని మొహంలో 'వెలుగు' కనిపించింది. కానీ అది క్షణికం. వెంటనే దీనత్వం గోచరించింది. అతను రెండుచేతులూ వినయంగా జోడించేడు. ముచ్చట వేసింది నాకు.

అత నన్నాడు.

"మీకు తెలీదా సార్! మానాన్న పోయేరు!"

నా నెత్తిమీద పిడుగుపడినట్లయింది. మళ్ళీ అతనే అన్నాడు.

"అయ్యా! సార్! దేవుడు నాకు అన్యాయం చేసేడు

సార్! నే నిప్పుడు తండ్రిలేని వెధవని, కుర్ర కుంకని. నా మీద జాలి చూపించండి. నన్నోదార్చండి సార్."

నా కళ్ళల్లో నీళ్లు గిర్రున తిరిగేయి. నిలువెల్లా కంపించి పోయేను. అతన్తో ఏం చెప్పకుండానే వెను తిరిగేను. అత నింకా ఏడుస్తూనే వున్నాడు.

మావూరు బస్సెక్కేంతర్వాత అనుకున్నాను:

అమ్మిరెడ్డికి నాటకంలోనేకాదు, జీవితం లోనూ అన్యాయం జరిగిపోయింది. చిట్టిబాబూ! నువ్వీ నాటకం వెయ్యొద్దింకా! కేవలం నాటకాలు రాసేవాడినేగాని జీవితాలుమార్చే చాతుర్యం నా కెక్కడుంది నాయనా! నే నెవర్నీ ఉద్ధరించలేను. నిన్ను ఓదార్చలేను. నిజం!

— జయశ్రీ పత్రిక నుండి